వాస్తవాలు పలుకు DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 78 | 31-07-2026 బుధవారం | పేజీలు: 08 | వెల: 3/-



## హిందుత్వం మతం కాదు.. జీవన విధానం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రత్యేక కార్యక్రమం
- 'కర్మవీరులారా కదిలి రండి' గీతావిష్కరణ
- హిందుత్వంపై మాజీ ఉప రాష్ట్రపతి కీలక వ్యాఖ్యలు
- జీవన విధానమని, సాంస్కృతిక వారసత్వమని వెల్లడి
- ఐక్యత లోపిస్తే దేశ ప్రగతి వెనకబడుతుందని సూచన

2

## కంగనాతో విభేదాలు లేవు



- తనపై కంగనా చేసిన వ్యాఖ్యలకు సీజేపీ అధికార ప్రతినిధి స్పందన
- "నిరుద్యోగి, పనికిరాని వాడు" అన్న వ్యాఖ్యలను తప్పుబట్టిన సౌరవ్
- హృతిక్ రోషన్ ప్రస్తావనతో వ్యంగ్య వ్యాఖ్యలు
- చర్చల ద్వారానే విభేదాలు పరిష్కరించుకోవాలని సూచన

2

# ప్రపంచంతో పోటీ పడే విద్యే లక్ష్యం

**రాజీనామా ఎందుకు చేయాలని ప్రతిపక్షాలను ప్రశ్నించిన సీఎం**

- తెలంగాణలో ఫిన్లాండ్, జర్మనీ తరహా విద్యావిధానం: సీఎం రేవంత్‌రెడ్డి
- వెనుకబాటుతనాన్ని రూపుమాపేది విద్య ఒక్కటేనన్న ముఖ్యమంత్రి
- 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రపంచజ్ఞానం అందించాలన్న సూచన
- సర్కారు పాఠశాలల్లో ఏఐ కోడింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు
- ప్రతి మండలంలోని విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేలా కృషి చేయాలని పిలుపు
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత తనదేనని హామీ
- ఆరు నెలలకోసారి టీచర్లతో సమావేశమై సమీక్షిస్తానన్న సీఎం
- ప్రభుత్వ కాలేజీలపై విద్యార్థుల్లో విశ్వాసం పెంచాలని సూచన



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంతరెడ్డి అన్నారు. ఫిన్లాండ్, జర్మనీ వంటి దేశాల విద్యా విధానాలను కేవలం అధ్యయనం చేయడం కాకుండా రాష్ట్రంలో అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వెనుకబాటుతనాన్ని తొలగించ గల శక్తి విద్యకే ఉందని, భాషా పరిజ్ఞానం మాత్రమే కాకుండా 12వ తరగతి

మిగతా 2 లో..



## హైదరాబాద్‌ను ముంచెత్తుతున్న వానలు

- మరో రెండు రోజులు భారీ వర్షా లు..
- జంట నగరాలకు ఆరెంజ్ అలర్ట్
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక
- సాయంత్రం వేళల్లో మోస్తరు నుంచి భారీ వర్షా లు కురిసే అవకాశం
- జలమయమైన పలు కాలనీలు..
- వాటర్‌లాగింగ్ ప్రాంతాల్లో భారీ మోటార్ల ఏర్పాటు
- ఐటీ కారిడార్‌లోని కీలక జంక్షన్లపై హైడ్రా ప్రత్యేక నిఘా
- ఎగువ ప్రాంతాల వరద ప్రవాహంతో నిండుకుండలా మారిన హుస్సేన్ సాగర్
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ సూచన

**హైదరాబాద్, (డిడి9 వార్త):** హైదరాబాద్‌ను ఎడతెరిపి లేని వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కొనసాగే అవకాశముందని భారత వాతావరణ శాఖ (IMD)

మిగతా 2 లో..



## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

- పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్
- నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలని సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణ
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న బండి సంజయ్


2



## పశ్చిమాసియాలో మళ్లీ రగిలిన యుద్ధ జ్వాలలు

- ఇరాన్ క్షిపణి దాడిని తిప్పికొట్టిన అమెరికా
- జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి
- తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన క్షిపణి ప్రయోగాలు
- పేట్రియాట్ డిఫెన్స్ సిస్టమ్స్ అప్రమత్తం
- గాల్లోనే ఐదు బాలిస్టిక్ క్షిపణుల ధ్వంసం
- శాంతి ఒప్పందం తర్వాత నేరుగా తొలి దాడి
- ఇరాన్‌పై భీకర రీతిలో ప్రతిదాడి చేస్తామన్న ట్రంప్

# జూరాలకు పోటెత్తుతున్న వరద



- 10 గేట్లు ఎత్తి నీటి విడుదల..
- శ్రీశైలానికి 77 వేల క్యూసెక్కుల ప్రవాహం
- ఎగువ నుంచి భారీగా చేరుతున్న వరద నీరు
- జూరాల 10 గేట్లు ఎత్తిన అధికారులు
- 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు
- శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న భారీ ప్రవాహం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి పెరుగుతోంది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.
ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులోకి 90,000 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. దిగువకు గేట్ల ద్వారా 39,080 క్యూసెక్కులు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 38,272 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 77,352 క్యూసెక్కుల నీరు శ్రీశైలం

మిగతా 2 లో..




## రికార్డులు భద్రపరచండి

- నీట్ నిరసనలపై దాడుల కేసులో కీలక పరిణామం
- పెల్లెట్ గన్స్ వినియోగంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు
- కేంద్రానికి రికార్డులు భద్రపరచాలని ఆదేశం
- యశోవర్ధన్ ఆజాద్ నేతృత్వంలో పిల్ దాఖలు
- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పిటిషనర్ల వాదన
- ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ వాడిన ఆయుధాలపై నివేదిక
- పూర్తి వివరాలు కోరిన అత్యున్నత న్యాయస్థానం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** దేశ రాజధాని ఢిల్లీలో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలు పెల్లెట్ గన్స్ ఉపయోగించడంపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గురువారం రోజున అత్యంత కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళనల సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసులు మరియు ఆర్ఏఎఫ్ బలగాలు వాడిన మందుగుండు సామగ్రికి సంబంధించిన అన్ని రికార్డులను

మిగతా 2 లో..



## ఇందిరమ్మ ఇళ్లపై వదంతులు నమ్మొద్దు

- తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్
- దరఖాస్తు చేస్తే ఇతర పథకాలు ఆగవు
- క్యూర్ పరిధిలోనూ ఎలాంటి ఇబ్బంది లేదన్న స్పష్టీకరణ
- సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి
- పేదలకు ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్న గౌతమ్
- తప్పుడు ప్రచారంపై చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకుంటే ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిలిచిపోతాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ ఖండించారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసినా ఇతర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం వీడియో సందేశాన్ని

మిగతా 2 లో..

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):** దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు,

మిగతా 3 లో..



# తెలంగాణలో భారీ వర్షా లు.. నిండుకుండల్లా జలాశయాలు!

- రాష్ట్రవ్యాప్తంగా వానలు, జలాశయాలకు జలకళ: 33 శాతానికి చేరిన నిల్వలు
- గోదావరిలో ఉద్ధృతంగా ప్రవాహం: భద్రాచలంలో 27 అడుగులకు చేరిన నీటిమట్టం
- పర్ణశాల, తాలిపేరు వద్ద వరద ఉద్ధృతి: స్థానిక వాగులు పొంగిపొర్లుతున్న పరిస్థితి
- శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌లకు భారీగా వరద: కడెం ప్రాజెక్టుకు నిలకడగా ఇన్‌ఫ్లో
- జగిత్యాలలో స్తంభించిన రవాణా, పాఠశాలలకు సెలవు: కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు
- కాళేశ్వరం, మేడిగడ్డ వద్ద ప్రవాహాల ఉద్ధృతి: పుష్కర ఘాట్లను తాకుతున్న గోదావరి
- సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వల వివరాలు: దిగువకు ప్రవాహాలను విడుదల చేస్తున్న అధికారులు
- పరీవాహక ప్రజలకు అధికారుల తీవ్ర అప్రమత్తత: అత్యవసర సహాయక చర్యలు సిద్ధం



**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా తెలంగాణలోని ఎగువ ప్రాంతాలు మరియు వివిధ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రధాన జలాశయాలన్నింటికీ భారీగా

మిగతా 2 లో..

# ఇందిరమ్మ ఇళ్లపై వదంతులు నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి**

విడుదల చేశారు.
స్థలం లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గౌతమ్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్యూఆర్ పద్ధతిలో దరఖాస్తు చేస్తే రేషన్, పెన్షన్, రైతుబంధు, ఆరోగ్యశ్రీ లేదా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని గౌతమ్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవడం వల్ల లబ్ధిదారులు ప్రస్తుతం పొందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని నమ్మకుండా, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ఆయన కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మఇళ్ల పథకంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గౌతమ్ హెచ్చరించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ధైర్యంగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో భారీ వర్షాలు.. నిండుకుండల్లా జలాశయాలు!

**మొదటిపేజీ తరువాయి**

నీరు వచ్చి చేరుతోంది. వర్షాల ప్రభావంతో ఈ సీజన్‌లో మొదటిసారిగా ప్రాజెక్టుల్లో మొత్తం నీటి నిల్వలు 33 శాతానికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాన నదులైన గోదావరి, కృష్ణాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గోదావరిలో నీటిమట్టాలు రోజురోజుకూ పెరుగుతుండగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టు వైపు వేగంగా పరుగులు తీస్తోంది.
భద్రాచలంలో బుధవారం వరకు 16 అడుగుల మేర ప్రవహించిన గోదావరి నది, గురువారం ఉదయానికి ఏకంగా 27 అడుగులకు పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఉధృతి కారణంగా భద్రాచలం వద్ద నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశం ఉందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రవాహం పెరగడంతో భద్రాచలం స్నానఘట్టాల వద్ద మెట్ల వరకు వరద నీరు వచ్చి చేరింది. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద సీత వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది.
ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రముఖ నీటిపారుదల ప్రాజెక్టయిన శ్రీరాంసాగర్‌కు వరద నీరు పోటెత్తుతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులోకి 9,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో నీటిమట్టం 1,065.7 అడుగులకు చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 3,935 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రస్తుత నీటిమట్టం 1,395.8 అడుగులకు పెరిగింది. నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు, పూర్తిస్థాయి సామర్థ్యం 17.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 42 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో నీటిమట్టం 693 అడుగులకు పెరిగింది. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల నేరెళ్ల, అనంతారం ప్రాంతాల్లో జాతీయ రహదారిపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతోంది. వాగుల ఉధృతి పెరగడంతో వరుసగా రెండో రోజు కూడా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని బట్టి అధికారులు జగిత్యాల జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల అత్యవసర సహాయం కోసం 7989193131 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. కాళేశ్వరం సమీపంలో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో సాధారణ పుష్కర ఘాట్, సరస్వతీ పుష్కర ఘాట్‌ల వద్ద జలకళ సంతరించుకుంది. ఇక్కడ నీటి మట్టం 6.32 మీటర్లకు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి ఎగువ నుంచి దాదాపు 1.1 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. అయితే గత మూడేళ్లుగా బ్యారేజీకి సంబంధించిన 85 గేట్లను తెరిచే ఉంచడంతో వచ్చిన నీరు వచ్చినట్లే దిగువ ప్రాంతాలకు ప్రవహించిపోతోంది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయానికి ప్రస్తుతం 517 క్యూసెక్కుల వరద చేరుతుండగా, అధికారులు అవుట్‌ఫ్లో 470 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.24 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. వర్షాలు ఇలాగే కొనసాగితే నీటి నిల్వలు మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.
వర్షాల ఉధృతి మరియు నదీ ప్రవాహాలు పెరుగుతున్న దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. ఏయే జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉందో అక్కడ సహాయక బృందాలను సిద్ధంగా ఉంచామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.

# పశ్చిమాసియాలో మళ్లీ రగిలిన యుద్ధ జ్వాలలు

* **ఇరాన్ క్షిపణి దాడిని తిప్పికొట్టిన అమెరికా**
* **జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి**
* **తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన క్షిపణి ప్రయోగాలు**
* **పేట్రియాట్ డిఫెన్స్ సిస్టమ్స్ అప్రమత్తం**
* **గాల్లోనే ఐదు బాలిస్టిక్ క్షిపణుల ధ్వంసం**
* **శాంతి ఒప్పందం తర్వాత నేరుగా తొలి దాడి**
* **ఇరాన్‌పై భీకర రీతిలో ప్రతిదాడి చేస్తామన్న ట్రంప్**

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

పశ్చిమాసియా ప్రాంతంలో మరోసారి యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. జోర్డాన్‌లోని అమెరికా కీలక సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దళాలు బాలిస్టిక్ క్షిపణులతో మెరుపు దాడికి యత్నించడంతో అక్కడ మళ్లీ యుద్ధ జ్వాలలు తీవ్రస్థాయిలో రగిలాయి. ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చిన ఈ క్షిపణి దాడులను అమెరికా సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ పరిణామంతో అగ్రరాజ్యం అమెరికా మరియు ఇరాన్ మధ్య మునుపెన్నడూ లేని విధంగా ఉద్రిక్తతలు పెరిగాయి.
ఇరాన్ నుంచి అనేక బాలిస్టిక్ క్షిపణులు జోర్డాన్ సరిహద్దులోని అమెరికా సైనిక కాంపౌండ్ వైపు వేగంగా దూసుకొచ్చాయని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ధ్రువీకరించింది. దాడి ముప్పును ముందే పసిగట్టిన అమెరికా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ తక్షణమే అప్రమత్తమయ్యాయి. అధునాతన రక్షణ వ్యవస్థల సాయంతో ఇరాన్ ప్రయోగించిన అన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా పేల్చివేసి ధ్వంసం చేశాయి. ఈ దాడి వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదని జోర్డాన్ సైనిక వర్గాలు స్పష్టం చేశాయి.
భద్రతా కారణాల దృష్ట్యా ఆ నిర్దిష్ట వైమానిక స్థావరం పేరును అధికారులు బయటకు వెల్లడించనప్పటికీ, ఇది సరిహద్దులోని అత్యంత కీలకమైన యూఎస్ మిలిటరీ కాంపౌండ్ అని సమాచారం. గతంలో కుదిరిన శాంతి ఒప్పందం నేపథ్యంలో అమెరికా తన వైమానిక దాడులను నిలిపివేసిన తర్వాత, ఇరాన్ నేరుగా అమెరికా మిలిటరీ స్థావరంపై జరిపిన మొదటి బాలిస్టిక్ క్షిపణి దాడి ఇదే కావడంతో తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ తాజా పరిణామంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. ఒక ప్రముఖ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అమెరికా సైనిక బలగాలు, ఆస్తులపై దాడులు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తమ రక్షణ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని, గంటకు 8,000 మైళ్ల కంటే ఎక్కువ వేగంతో దూసుకొచ్చిన ఐదు ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను పేట్రియాట్ వ్యవస్థ ద్వారా గాల్లోనే విజయవంతంగా కూల్చివేసామని ఆయన వివరించారు.
అంతేకాకుండా, ఈజిప్టు పోర్టులో అమెరికాకు చెందిన సహజవాయువు ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిపై కూడా ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌కు తగిన రీతిలో బుద్ధి చెబుతామని, రాబోయే రోజుల్లో వారిపై అత్యంత భీకర స్థాయిలో దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. తాము జరిపే ప్రతిదాడి తట్టుకోవడం ఇరాన్‌కు సాధ్యం కాదని, అమెరికా రక్షణ వ్యవస్థల ముందు ప్రపంచంలో ఏ శక్తి నిలబడలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఇటు ఇరాన్ దాడులకు ప్రతిస్పందనగా అమెరికా మరియు సౌదీ అరేబియా దళాలు తక్షణమే రంగంలోకి దిగాయి. ఇరు దేశాల సైన్యాలు సంయుక్తంగా ఇరాక్ భూభాగంలో ఉన్న ఇరాన్ మద్దతుగల మిలీషియా గ్రూపులపై భారీ ఎత్తున వైమానిక దాడులను ప్రారంభించాయి.

# హైదరాబాద్‌ను ముంచెత్తుతున్న వానలు

**మొదటిపేజీ తరువాయి**

హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.
మాన్సూన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హైడ్రా, జీహెచ్‌ఎంసీ, విపత్తు నిర్వహణ శాఖలు అప్రమత్తమయ్యాయి. నగరంలోని వాటర్‌లాగింగ్ ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా భారీ మోటార్లను ఏర్పాటు చేశారు. రాయదుర్గం, బయోడైవర్సిటీ జంక్షన్, ఐకియా జంక్షన్‌తో పాటు ఐటీ కారిడార్‌లోని పలు కీలక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు.
ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. కూకట్‌పల్లి, బుల్కాపూర్, పికెట్ నాలాలాల నుంచి వరద ప్రవాహం భారీగా సాగర్‌లోకి చేరుతోంది. నాలాలు, చెరువుల పరిసర ప్రాంతాల్లో అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.
భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, నీటితో నిండిన రహదారులు, నాలాల సమీపంలో వెళ్లకుండా



జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో జీహెచ్‌ఎంసీ, విపత్తు నిర్వహణ శాఖ హెల్ప్‌లైన్‌లను సంప్రదించాలని సూచించారు.

# హిందుత్వం మతం కాదు.. జీవన విధానం

* **మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**
* **స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రత్యేక కార్యక్రమం**
* **'కర్మవీరులారా కదిలి రండి' గీతావిష్కరణ**
* **హిందుత్వంపై మాజీ ఉప రాష్ట్రపతి కీలక వ్యాఖ్యలు**
* **జీవన విధానమని, సాంస్కృతిక వారసత్వమని వెల్లడి**
* **ఐక్యత లోపిస్తే దేశ ప్రగతి వెనకబడుతుందని సూచన**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హిందుత్వం అనేది కేవలం ఒక నిర్దిష్ట మతం కాదని, అదొక గొప్ప జీవన విధానమని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో గురువారం నిర్వహించిన 'కర్మవీరులారా కదిలి రండి' అనే స్ఫూర్తిదాయక గీతావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'విద్యార్థులతో మాటమంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొని, నేటి యువత, సమాజ బాధ్యతలపై దిశానిర్దేశం చేస్తూ ప్రసంగించారు. దేశంలో ప్రతీ పౌరుడిలోనూ దేశభక్తి, సమాజ ఐక్యత భావనలు అత్యంత అవసరమని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. సమాజంలో ఐక్యత లోపించినప్పుడు దేశ ప్రగతి మందగిస్తుందని, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మన సాంస్కృతిక మూలాలను గుర్తుంచుకుంటూనే, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన మహోన్నతమైన జీవన విలువలను తర్వాతి తరాలకు అందించడమే హిందుత్వంలోని అసలైన సారాంశమని ఆయన అభిప్రాయపడ్డారు.యువత మంచి గీతాలను వినాలని, వాటిలోని భావాన్ని అర్థం చేసుకుని స్ఫూర్తి పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. జాతీయ గేయం 'వందేమాతరం' మన భారతదేశ మూలాలకు, ఐక్యతకు దివ్యమైన సమాధానమని తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రతి పౌరుడూ కంకణం కట్టుకుని పని చేయాలని, మాతృభూమి రుణం తీర్చుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఒక శక్తివంతమైన, వికసిత భారత్ రూపకల్పనలో నేటి యువతీ యువకుల పాత్రే అత్యంత కీలకమైనదని ఆయన నొక్కి చెప్పారు.
నేటి తరం యువత సమయాన్ని ఎక్కువగా మొబైల్ ఫోన్లు, యూట్యూబ్, సోషల్ మీడియా వేదికలపైనే గడుపుతుండటంపై ఆయన కాస్త ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ పరికరాలకు బానిసలు కాకుండా, విజ్ఞానాన్ని ప్రసాదించే పుస్తకాలను చదవ అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. జీవితంలో సరైన దారిలో నడవడానికి ప్రతి ఒక్కరూ ఒక మంచి గురువును ఎంచుకోవాలని సూచించారు. పుస్తకాలు, ఉత్తమ గురువులే మనిషిని జ్ఞానవంతుడిగా, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దుతాయని వెంకయ్యనాయుడు వివరించారు. యువత ఇతరులపై ఆధారపడకుండా తమ భవిష్యత్తును తామే స్వయంగా నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని మాజీ ఉప రాష్ట్రపతి ఆకాంక్షించారు. స్వయంశక్తి, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ ద్వారా మాత్రమే జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని చెప్పారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, నైతిక విలువలతో కూడిన ప్రగతి సాధించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. "గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# కంగనాతో విభేదాలు లేవు

* **తనపై కంగనా చేసిన వ్యాఖ్యలకు సీజేపీ అధికార ప్రతినిధి స్పందన**
* **"నిరుద్యోగి, పనికిరాని వాడు" అన్న వ్యాఖ్యలను తప్పుబట్టిన సౌరవ్**
* **హృతిక్ రోషన్ ప్రస్తావనతో వ్యంగ్య వ్యాఖ్యలు**
* **చర్చల ద్వారానే విభేదాలు పరిష్కరించుకోవాలని సూచన**

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ తనపై చేసిన విమర్శలకు కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ స్పందించారు. తనను "పనికిరాని వాడు", "నిరుద్యోగి" అంటూ కంగనా చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని అన్నారు. గూగుల్‌లో సెర్చ్ చేస్తే తన గురించి తప్పుడు సమాచారం కనిపిస్తోందని, వాటిని ఆధారంగా చేసుకుని విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.
ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన సౌరవ్ దాస్.. కంగనా తన వ్యాఖ్యలపై ఎందుకు అంత తీవ్రంగా స్పందించారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఇదే విషయంపై తన స్నేహితులు కూడా సరదాగా స్పందించారని చెప్పారు. "నా స్నేహితుల్లో ఒకరు 'నీకు చిన్నప్పటి హృతిక్ రోషన్‌లా కనిపిస్తున్నావేమో.. అందుకే కంగనా ఇలా స్పందించి ఉంటారు' అని మెసేజ్ చేశారు. అది చూసి నేను కూడా ఆశ్చర్యపోయాను" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.
అయితే, తనకు కంగనాపై ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని సౌరవ్ స్పష్టం చేశారు. "ఆమెతో నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్య లేదు. గొడవ పడాల్సిన అవసరం కూడా లేదు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. అలాంటి విభేదాలు ఉంటే పరస్పరం మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి" అని అన్నారు. తాను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. "'కంగనా.. కాస్త ప్రశాంతంగా ఉండండి.. మాట్లాడుకుందాం' అని పోస్ట్ చేశాను. దేశంలో ప్రస్తుతం చర్చలు, సంభాషణలు తగ్గిపోతున్నాయి. ఒకరి అభిప్రాయాన్ని మరొకరు వినే సంస్కృతి బలహీనపడుతోంది. పరస్పర గౌరవంతో చర్చించుకునే వాతావరణం ఉండాలి" అని వ్యాఖ్యానించారు.
అలాగే, కంగనా తన వ్యాఖ్యలను మరోసారి పునఃసమీక్షించుకోవాలని సూచించారు. తనతో మాట్లాడాలనుకుంటే నేరుగా ఫోన్ చేయవచ్చని, ఆమెతో సంభాషించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఈ వివాదానికి ముందు కంగనా రనౌత్.. "నా వయసులోనే నేను రెండు జాతీయ అవార్డులు సాధించాను. కానీ సౌరవ్ దాస్ ఇప్పటికీ పనికిరాని వ్యక్తిగా, నిరుద్యోగిగా ఉన్నారు" అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలకే తాజాగా సౌరవ్ దాస్ తనదైన శైలిలో స్పందిస్తూ, వ్యక్తిగత దాడుల కంటే సంభాషణకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# రికార్డులు భద్రపరచండి

**మొదటిపేజీ తరువాయి**

భద్రపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ప్రజాహిత వ్యాజ్యంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఈ వ్యాఖ్యలు చేసింది.
కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి యశోవర్ధన్ ఆజాద్‌తో పాటు పెల్లెట్ గాయాల బారిన పడిన ఇద్దరు బాధితులు సంయుక్తంగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. శాంతియుత రీతిలో తమ నిరసనలు తెలుపుతున్న పౌరులు, విద్యార్థులపై లోహంతో తయారైన పెల్లెట్లను ప్రయోగించడం పౌర హక్కులను కాలరాయడమేనని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది వృందా గ్రోవర్ కోర్టులో గట్టిగా వాదించారు. దేశవ్యాప్తంగా ఎలాంటి ఆందోళనల్లోనైనా పెల్లెట్ గన్స్ వాడకాన్ని శాశ్వతంగా నిషేధించాలని, ఈ దాడుల్లో గాయపడిన వారికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం, ఉచిత వైద్యం మరియు పునరావాసం కల్పించాలని వారు కోర్టును అభ్యర్థించారు.
ఈ వాదనలు విన్న ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి కీలక ఆదేశాలిచ్చింది. జులై 20న జంతర్‌మంతర్ వద్ద విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది వాడిన ఆయుధాలు, మందుగుండు వివరాల రికార్డులను భద్రపరచాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ) జారీ చేసిన నిర్దేశిత మార్గదర్శకాలను ధర్మాసనం ప్రస్తావించింది. అసాధారణ పరిస్థితులు ఎదురైనప్పుడు మాత్రమే పెల్లెట్ గన్స్ ఉపయోగించే అధికారం పోలీసులకు ఉంటుందని అంగీకరిస్తూనే, ప్రస్తుత నీట్ నిరసనల కేసులో వాటిని ఏ పరిస్థితుల్లో, ఎలా వాడారనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.
మరోవైపు, నిరసనల సమయంలో పెల్లెట్ గాయాల బారిన పడిన బాధితులకు తక్షణమే అత్యుత్తమ స్థాయి వైద్య సదుపాయాలు కల్పించాలని దిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాధితుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చికిత్సలను ఉచితంగా అందించాలని సూచించింది. సీజేపీ ఆధ్వర్యంలో జులై 20న చేపట్టిన "సంసద్ చలో" కార్యక్రమం సందర్భంగా పోలీసులు అనుసరించిన తీరుపై, ప్రయోగించిన బలప్రయోగంపై ప్రత్యేకంగా విచారణ జరుపుతామని ధర్మాసనం సంకేతాలు ఇచ్చింది. ఈ వ్యవహారంలో చట్ట అమలు సంస్థలు ప్రొటోకాల్ పాటించాయా లేదా అనే అంశంపై కేంద్ర, దిల్లీ ప్రభుత్వాలు సమర్పించే నివేదికలు ఎంతో కీలకం కానున్నాయి.
కాగా, గత మంగళవారం కూడా ఈ అంశంపై స్పందించిన సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసుల అత్యుత్సాహం మరియు అదనపు బలప్రయోగంపై నిష్పాక్షిక విచారణ జరిపేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఎందుకు ఏర్పాటు చేయకూడదని ప్రభుత్వాన్ని నిలదీసింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారం ఎవరికీ లేదని, నిర్దేశిత ప్రొటోకాల్స్ ఉల్లంఘించిన అధికారులు ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తప్పవని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అదేవిధంగా, నిరసనల సమయంలో అదుపులోకి తీసుకున్న లేదా అరెస్టు చేసిన 18 ఏళ్లలోపు విద్యార్థుల విషయంలో ధర్మాసనం మానవతా దృక్పథంతో స్పందించింది. ఎలాంటి నేరచరిత్ర లేని మైనర్ విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే కేసుల దర్యాప్తును మాత్రం చట్ట పరిధిలో కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించే పూర్తి వివరాల ఆధారంగా తదుపరి విచారణలో సుప్రీంకోర్టు మరిన్ని కీలక ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

# జూరాలకు పోటెత్తుతున్న వరద

**మొదటిపేజీ తరువాయి**

జలాశయం వైపు ప్రవహిస్తోంది.
ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో జూరాలకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అవసరమైతే ప్రాజెక్టులోని మరిన్ని గేట్లు ఎత్తి నీటి విడుదల పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.



# ప్రపంచంతో పోటీ పడే విద్యే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

వరకు విద్యార్థులకు ప్రపంచజ్ఞానం అందించాలని సూచించారు. ఫిన్లాండ్, జర్మనీలో పర్యటించిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. సర్కారు బడుల్లో ఏఐ కోడింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక అవసరాలకు సిద్ధం చేస్తామని చెప్పారు. ప్రతి మండలంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యాభివృద్ధికి అవసరమైన సూచనలు కింది స్థాయి నుంచే రావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సలహాల ఆధారంగానే విధానాలను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు.
తాను కూడా మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యతోనే ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని పేర్కొంటూ, ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల జీవితాలను మార్చగల సామర్థ్యం కలిగి ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివితే ఉద్యోగాలు వస్తాయనే నమ్మకాన్ని విద్యార్థుల్లో కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు.




ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత తనదేనని హామీ ఇచ్చిన సీఎం, పిల్లల విద్యకు సంబంధించిన అంశాలపై మాత్రం ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు, సూచనలపై చర్చిస్తానని తెలిపారు. ఐఏఎస్ అధికారులను చేసినంత సులువుగా టీచర్ల బదిలీలు చేయలేమని వ్యాఖ్యానించారు.
రాజకీయ అంశాలనూ ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. విద్యాశాఖకు రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై స్పందిస్తూ, విద్యార్థులకు అల్పాహారం అందించడం, విద్యా సంస్కరణలు చేపట్టడమే తన తప్పా అని ప్రశ్నించారు. విద్య, పిల్లల భవిష్యత్తు కోసం ఎంత ఖర్చైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది.

ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది.

2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు.

అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.





## బీసీ గురుకుల విద్యార్థుల భోజనంపై ఎమ్మెల్యే సీరియస్...

- **రుచికరమైన, పోషకాహారం అందించాలంటూ స్పష్టమైన ఆదేశాలు**

**బాన్సువాడ, జూలై 30(డిడి9 వార్త):**

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండల కేంద్రంలో ఉన్న మహాత్మాగాంధీ-జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం అందేలా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.విద్యార్థుల సౌకర్యార్థం రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన మరుగుదొడ్ల పనులను పరిశీలించిన ఆయన, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణ పనుల్లో ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.అనంతరం భోజనశాలను తనిఖీ చేసిన పోచారం, విద్యార్థులకు అందించే ఆహారం పోషక విలువలతో పాటు రుచికరంగా ఉండేలా అన్ని రకాల కూరగాయలు, పప్పులు, దినుసులను సమతుల్యంగా ఉపయోగించాలని వంట సిబ్బందికి సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలను పరిశీలించిన ఆయన, ఎప్పటికప్పుడు తాజా సరుకులనే కొనుగోలు చేసి వినియోగించాలని ఆదేశించారు.అలాగే పాఠశాల ఆవరణ, వంటశాల, హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఉపసర్పంచ్ పరమేష్, యువనాయకులు మియాపురం శశికాంత్, మాజీ ఎంపీపీ గాండ్ల రఘు, మేకల విట్టల్ స్థానిక నాయకులు,గురుకుల ప్రిన్సిపాల్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




## చెక్‌డ్యామ్‌లో జలకళ.. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే పోచారం

**బాన్సువాడ, జూలై 30(డీడీ9 వార్త):**

బీర్కూర్ శివారులో మంజీరా నదిపై ఇటీవల నిర్మాణం పూర్తయిన చెక్‌డ్యామ్‌లో భారీ వర్షాల కారణంగా సమృద్ధిగా నీరు చేరి జలకళ సంతరించుకుంది. చెక్‌డ్యామ్ నిండుకుండలా పొంగిపొర్లుతుండటంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం చెక్‌డ్యామ్‌ను సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి చెక్‌డ్యామ్ వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలు సమర్పించి ప్రార్థనలు చేశారు.రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఎమ్మెల్యే పోచారం ఆకాంక్షించారు.

చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన కొద్ది రోజులకే భారీగా నీరు చేరి పొంగిపొర్లుతుండటంతో రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ చెక్‌డ్యామ్ వల్ల భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు సాగునీటి అవసరాలు, తాగునీటి అవసరాలకు కూడా దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు చెక్‌డ్యామ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, ఇటువంటి నిర్మాణాలు వ్యవసాయాభివృద్ధికి, భూగర్భ జలాల పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. చెక్‌డ్యామ్‌లో నీరు ఉప్పొంగుతూ ఉండటంతో పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారగా, స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని జలకళను తిలకించారు.అయన వెంట యువజన నాయకులు మియాపురం శశికాంత్, మాజీ ఎంపీపీ రఘు, కొరిమె రఘు, దుంపల రాజు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.





## గర్భిణీ ఆరోగ్యమే బిడ్డకు భరోసా

- **ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**

**బాన్సువాడ, జూలై 30(డిడి9 వార్త):**

గర్భిణీ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడలోని తన నివాసంలో కల్యాణలక్ష్మి, ష్యాది ముబారక్ చెక్కుల పంపిణీ అనంతరం మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గర్భిణీ స్త్రీలకు పోషకాహారంతో కూడిన సమతుల్య ఆహారం అందించడం ప్రతి కుటుంబ సభ్యుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.పుట్టిన వెంటనే శిశువుకు తొలి పాలు (ముర్రుపాలు) తప్పనిసరిగా ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.తల్లి పాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు సమృద్ధిగా ఉంటాయని వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేను కూడా చిన్నతనంలో మా తల్లి పాలను నాలుగేళ్ల పాటు తాగాను.అందువల్లే ఆరోగ్యంగా ఉన్నాను. ప్రతి బిడ్డకు తల్లి పాలు అందితే వారు కూడా ఆరోగ్యంగా పెరుగుతారు అని పేర్కొన్నారు.ప్రతి కుటుంబం శుభ్రమైన, సురక్షితమైన తాగునీటినే వినియోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, లబ్ధిదారులు ఉన్నారు.

## అప్పుల భారంలేకుండా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ చేయూత

- **63 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పోచారం**

**బాన్సువాడ, జూలై 30 (డీడీ9 వార్త):**

పేద కుటుంబాలు అప్పుల భారానికి గురికాకుండా తమ కుమార్తెల వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 63 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్భాటాలకు వెళ్లి అప్పులు చేసి ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందని, తల్లిదండ్రులు ఎలాంటి ఆర్థిక ఒత్తిడి లేకుండా తమ కుమార్తెల వివాహాలను నిర్వహించుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు.ప్రస్తుతం వివాహం అనంతరం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను భవిష్యత్తులో వివాహానికి ముందే అందించే విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని ఎమ్మెల్యే వెల్లడించారు. అధికారులు కూడా చెక్కులను పెళ్లి పందిరిలోనే అందించేలా చర్యలు చేపట్టాలని సూచించినట్లు చెప్పారు.అనంతరం రైతాంగ సంక్షేమంపై మాట్లాడుతూ, రైతులకు ఏడాది పొడవునా సాగునీటి కొరత లేకుండా ఉండేలా ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని విస్తృతంగా చేపడుతున్నామని, వీటి ద్వారా భూగర్భ జలమట్టాలు పెరగడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన నీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి..

- **రహవీర్, పీఎం రహత్ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్ ఆశిష్ సంగవాన్**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (డిడి9 వార్త):**

రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రహవీర్ మరియు పీఎం రహత్ పథకాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగవాన్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి ఈ పథకాల అమలును సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు మానవత్వంతో స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంట అయిన గోల్డెన్ అవర్ లోపు బాధితుడిని ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరపున రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు క్యాష్‌లెస్ (ఉచిత) వైద్యం అందించే పీఎం రహత్ పథకం అమల్లో ఉందని వెల్లడించారు.పీఎం రహత్ పథకం కింద ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రమాదం జరిగిన తేదీ నుంచి 7 రోజుల వరకు గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందుతుందని తెలిపారు. ఈ సౌకర్యం జాతీయ రహదారులకే కాకుండా ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా వర్తిస్తుందని స్పష్టం చేశారు.రహవీర్ (గుడ్ సమారిటన్ రివార్డ్) పథకం ద్వారా ప్రమాద బాధితుడికి వెంటనే సహాయం చేసి ఆసుపత్రికి చేర్చిన వ్యక్తికి రూ.25 వేల ప్రోత్సాహక నగదు అందజేస్తారని తెలిపారు.సహాయం చేసిన వారికి పోలీసు లేదా కోర్టు ఇబ్బందుల భయం అవసరం లేదని, వారి హక్కులకు చట్టపరమైన రక్షణ ఉంటుందని చెప్పారు. ఒక వ్యక్తి సంవత్సరానికి గరిష్ఠంగా ఐదు సార్లు ఈ బహుమతి పొందే అవకాశం ఉందని వివరించారు.అనంతరం నిర్వహించిన అప్రిసియేషన్ కమిటీ సమీక్షా సమావేశంలో జిల్లా రవాణా అధికారి టి. సంతోష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశం తదితర అధికారులు పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా ఈ రెండు పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.






## బాన్సువాడలో వీధికుక్కల దాడి.. చిన్నారికి తీవ్ర గాయాలు

**బాన్సువాడ, జూలై 30(డిడి9 వార్త):**



బాన్సువాడ పట్టణంలోని టీచర్స్ కాలనీలో గురువారం విషాదకర ఘటన చోటుచేసుకుంది.గోతి నానక్ సింగ్ కుమార్తె రిషిత ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది.దాడిని గమనించిన స్థానికులు వెంటనే చిన్నారిని బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ ప్రసాద్, పైలట్ సుభాష్ వెంటనే స్పందించి ఘటనాస్థలానికి చేరుకున్నారు.ఈఆర్‌సీపీ సూచనల మేరకు చిన్నారికి అవసరమైన అత్యవసర వైద్య సహాయం అందిస్తూ సురక్షితంగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.108 అంబులెన్స్ సిబ్బంది అందించిన వేగవంతమైన సేవలను చిన్నారి తల్లిదండ్రులు, టీచర్స్ కాలనీ వాసులు అభినందిస్తూ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు 108 సిబ్బంది వెల్లడించారు .ఈ ఘటనతో కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వీధికుక్కల బెడదను నివారించేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్.కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోలీసుల అవగాహన కార్యక్రమం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30(డిడి9 వార్త):**

కామారెడ్డి పట్టణంలోని ఆర్.కే డిగ్రీ కళాశాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు కళాబృందం విద్యార్థులకు ప్రేమ పేరుతో జరిగే మోసాలు, పోక్సో చట్టం, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు, మైనర్లపై జరిగే నేరాలు, మానవ అక్రమ రవాణా నివారణ వంటి అంశాలపై వివరించారు.సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితరాలను జాగ్రత్తగా వినియోగించాలని, అపరిచితులను నమ్మి మోసపోవద్దని సూచించారు. చిన్న పొరపాటు కూడా జీవితాన్ని నాశనం చేసే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు, అధ్యాపకుల సూచనలను పాటిస్తూ మంచి లక్ష్యంతో చదువుకోవాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు.ఈ సందర్భంగా సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్ 1930, మాదకద్రవ్యాల ఫిర్యాదుల కోసం 1908, షీ టీమ్స్ నంబర్ 8712686094, అత్యవసర పరిస్థితుల్లో 100/112కు కాల్ చేయాలని సూచించారు.పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు. శేషరావు, పీసీలు ప్రభాకర్, సాయిలు పాటలు, సందేశాల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఎం. జయపాల్ రెడ్డి, భరోసా సిబ్బంది రజిత, కవిత, మహిళా సాధికారిత కేంద్రం ఇన్‌చార్జి సౌందర్య, తులసి, సరిత (అడ్వకేట్లు), సిద్ధ రామయ్య, నవీన్, మానవ అక్రమ రవాణా నియంత్రణ విభాగానికి చెందిన పీసీ రాజేందర్ పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




## పీఐడీ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా 120 మందికి అన్నదానం

**బాన్సువాడ, జూలై 30(డిడి9 వార్త):**



లయన్స్ క్లబ్ 320డి జిల్లా మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ (పీఐడీ) ఘట్టమనేని బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.బీర్కూర్ మండలానికి చెందిన వికలాంగులతో పాటు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న యాచకులకు సుమారు 120 మందికి పైగా భోజనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలు, వికలాంగులు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముఖ్యమైన భాగమని తెలిపారు.ఘట్టమనేని బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు కుమ్మరి సాయిలు, అహ్మద్, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సీతలే రమేష్, క్లబ్ కార్యదర్శి గాండ్ల సాయికృష్ణ, సీనియర్ లయన్ ఎం.ఏ. రషీద్, కొట్టూరి సంతోష్ సేట్, వీరయ్య సేట్, లయన్స్ సభ్యులు మేరు భరత్, సతీష్ యాదవ్, నగేష్ యాదవ్, గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కవచ్ ఘన విజయం..ఏడాదిలో రూ.2.01 కోట్ల గంజాయి స్వాధీనం

- ఎస్పీ రాజేష్ చంద్ర

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా పోలీసులు ఏడాది క్రితం ప్రారంభించిన ఆపరేషన్ కవచ్ కార్యక్రమం విశేష ఫలితాలు సాధించిందని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు.కార్యక్రమం ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఆపరేషన్ విజయాలను వివరించారు.ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఏడాది కాలంలో ఎన్డీపీఎస్ చట్టం కింద 6 కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్టు చేశారు.మొత్తం 403.405 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, దాని విలువ సుమారు రూ.2.01 కోట్లు ఉంటుందని తెలిపారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 387.128 కిలోల గంజాయిని జాతీయ రహదారి44పై క్యాసంపల్లి వద్ద స్వాధీనం చేసుకోవడం ఆపరేషన్‌లో కీలక విజయమన్నారు.
అక్రమ ఇసుక రవాణాపై 11 కేసులు, పశువుల అక్రమ రవాణాపై 3 కేసులు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై 3 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గుట్కా అక్రమ రవాణా కేసులో రూ.43 లక్షల నగదును సీజ్ చేసినట్లు వెల్లడించారు.మోటార్ సైకిల్ దొంగతనాలు, ఆయుధాల అక్రమ వినియోగాన్ని అరికట్టే క్రమంలో 18 దొంగిలించిన బైక్‌లు, 5 దేశీయ తుపాకులు, ఒక ఎయిర్ గన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆలయ చోరీలు, ఏటీఎం దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాలను అరెస్టు చేసినట్లు తెలిపారు. గాంధారి పరిధిలో అడవి జంతువుల వేటకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పట్టుకుని వారి వద్ద నుంచి ఐదు నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.అంతేకాకుండా, దొంగిలించబడిన రూ.5 లక్షల విలువైన ట్రాక్టర్‌ను రెండు గంటల్లోనే రికవరీ చేసి యజమానికి అప్పగించామని, నాగిరెడ్డిపేటలో ఎనిమిది కిలోమీటర్ల మేర ఛేజింగ్ నిర్వహించి నలుగురు వాహన దొంగలను పట్టుకున్నామని తెలిపారు.




ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 5,16,984 వాహనాలను తనిఖీ చేసి, 1,19,052 మందిని పరీక్షించినట్లు ఎస్పీ వివరించారు. 209 మంది అనుమానితులను గుర్తించి, 3,572 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. భిక్కనూర్ టోల్‌ప్లాజా వద్ద మద్యం సేవించి బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను పట్టుకుని 45 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఘటనను గుర్తు చేశారు.ఆపరేషన్ కవచ్ అమలుతో జిల్లాలో అంతర్రాష్ట్ర నేర ముఠాల కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని ఎస్పీ తెలిపారు. టేక్రియాల్ జంక్షన్ వద్ద ఒంటరిగా ఉన్న 14 ఏళ్ల బాలుడిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించడం, సదాశివనగర్ ఎల్లమ్మ గుడి, లింగాపూర్ ప్రాంతాల్లో జరిగిన దొంగతనాలను గంటల వ్యవధిలోనే ఛేదించడం వంటి మానవీయ సేవలు కూడా పోలీసుల పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.మీడియా సమావేశం అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ రాజేష్ చంద్ర కేక్ కట్ చేసి ఆపరేషన్ కవచ్ ఏడాది పూర్తి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై జిల్లాల యంత్రాంగం అప్రమత్తం..

- అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు
- 24 గంటలు కంట్రోల్ రూమ్‌లు పనిచేయాలి..
- ప్రజలకు వెంటనే సహాయం అందించాలని సూచన
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30(డిడి9 వార్త):**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సీఎస్ సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌తో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలు, వరదల పరిస్థితిపై సమీక్షించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు పనిచేయాలని, అధికారులు తమ కేంద్ర కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షపాతం, డ్యాంలలో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించాలని, ఎక్కడైనా సమస్యల సమాచారం అందితే వెంటనే స్పందించాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలని, వైద్య ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు పశుకాపరులు, మత్స్యకారులు, ప్రజలు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల సమయంలో పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని, ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ స్తంభాలను తాకరాదని ప్రజలకు అవగాహన కల్పించాలని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని, పాత భవనాల్లో నివసిస్తున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, ట్రైనీ కలెక్టర్ రవితేజ, సీఈవో చందర్, డీఆర్ఓ పాండు, డీపీఓ మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సంగెం నగేష్ రెడ్డికి నివాళి.. కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే పోచారం

**బాన్సువాడ, జూలై 30(డిడి9 వార్త):**

బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో తన వ్యక్తిగత సహాయకుడు (పీఏ), సమీప బంధువు సంగెం సురేందర్ రెడ్డి సోదరుడు కీ.శే. సంగెం నగేష్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కీ.శే. సంగెం నగేష్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారిని ఓదార్చారు.నగేష్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని కల్పించేలా పరామర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, పోచారం శంభు రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై కీ.శే. సంగెం నగేష్ రెడ్డికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరిక

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30(డిడి9 వార్త):**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ఐపీఎస్ సూచించారు.మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్వంచ వాగును గురువారం స్వయంగా పరిశీలించిన ఆయన, వరద పరిస్థితులను అధికారులతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వరద ప్రవాహాలు ఉధృతంగా ఉన్న ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సెల్ఫీలు, వీడియోల కోసం వాగులు, చెరువులు, వంతెనల వద్దకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని హెచ్చరించారు.
వరదలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు గమనించిన వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. పోలీసు శాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా పోలీసు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర కోరారు.



# బాన్సువాడలో కుక్కలు, కోతుల బెడదపై మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు..

- శుక్రవారం నుంచి ప్రత్యేక బృందాల రంగప్రవేశం



**బాన్సువాడ, జూలై 30(డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణంలో వీధి కుక్కలు, కోతుల బెడద నివారణకు మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుల విజయ తెలిపారు. ఇటీవల వీధి కుక్కల దాడిలో చిన్నారులు గాయపడిన ఘటన బాధాకరమని పేర్కొంటూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఆమె వెల్లడించారు.శుక్రవారం నుంచి ప్రత్యేక బృందాలు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కుక్కలు, కోతులను పట్టుకునే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. పట్టుబడిన వీధి కుక్కలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టెరిలైజేషన్ శస్త్రచికిత్సలు నిర్వహించి, యాంటీ రేబిస్ టీకాలు వేయించేందుకు తరలిస్తామని చెప్పారు.కోతుల బెడద నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపడతామని వివరించారు.ప్రజలు కొద్ది రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నారులను ఒంటరిగా బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.అలాగే ఇళ్ల పరిసరాల్లో ఆహార వ్యర్థాలు, తినుబండారాల అవశేషాలను బయట వేయకుండా పరిశుభ్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు.
ప్రజల ఆరోగ్య సంరక్షణ, వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యల నివారణ కోసం మున్సిపాలిటీ ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని ప్రత్యేక యంత్రాల సహాయంతో తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టామని చెప్పారు.ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ప్రాంతం, తాడ్కోల్ రోడ్ పరిసరాల్లో పూడిక తొలగింపు పనులు పూర్తయ్యాయని, దీంతో మురుగు నీటి ప్రవాహం మెరుగుపడి ప్రజలకు ఇబ్బందులు తగ్గాయని పేర్కొన్నారు.వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు
కొనసాగుతున్నాయని తెలిపారు.పట్టణ ప్రజల భద్రత, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కుక్కలు, కోతుల బెడదతో పాటు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ అన్ని విధాలా కట్టుబడి పనిచేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుల విజయ స్పష్టం చేశారు.

# ఉప్పొంగిన వాగులు. నిలిచిన రాకపోకలు

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ( డి డి 9 వార్త )**

తులమడుగు మండలంలోని పలు గ్రామాలలో. గురువారం కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. మరి కొన్ని పంట చేనులు చెరువులను తలపించాయి.
భారీ వర్షాల కారణంగా. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నా వాగుల వద్దకు వెళ్లి సెల్ఫీలు వీడియోలు. తీయకూడదు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకూడదు. ఏదైనా ప్రమాదం సంభవించిన ప్పుడు. స్థానిక అధికారులకు. లేదా డయల్ 100.కి సమాచారం అందించాలని వాతావరణ శాఖ జారీచేసిన. హెచ్చరికలని. తూచా తప్పకుండా పాటించాలని డిడి 9 వార్త న్యూస్. ప్రజల మేలుకోరి పలు సూచనలను చేస్తుంది



# మానవ అక్రమ రవాణాపై యువత అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఐ. ప్రసన్న

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30(డిడి9 వార్త):**

మానవ అక్రమ రవాణాపై యువత అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఐ. ప్రసన్న పిలుపునిచ్చారు.జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం, సఖి కేంద్రం సంయుక్తంగా మిషన్ శక్తి పథకం కింద గురువారం కామారెడ్డిలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఐ. ప్రసన్న మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని పేర్కొన్నారు.అక్రమ రవాణా జరిగే విధానాలు, దానికి దారితీసే కారణాలు, యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు.అలాగే మాదకద్రవ్యాల వినియోగం, సెల్‌ఫోన్ వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ, జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ తరఫున పాల్గొన్న న్యాయవాది కె. సిద్ధిరాములు విద్యార్థులకు న్యాయపరమైన హక్కులు, మౌలిక హక్కులు, మహిళలు, పిల్లల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు.అనంతరం కళాజాత బృందం పాటలు, ప్రదర్శనల ద్వారా మానవ అక్రమ రవాణా నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యపరిచింది.ఈ కార్యక్రమంలో ఆర్‌కే డిగ్రీ కళాశాల సీఈవో జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్, అమృత దత్త హరి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# సలబత్‌పూర్ చెక్‌పోస్ట్ ఘటనపై విచారణ..

- కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు సిఫారసు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30(డిడి9 వార్త):**

సలబత్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద చోటుచేసుకున్న ఘటనపై ప్రాథమిక విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద్ రెడ్డి తెలిపారు. ఘటనకు సంబంధించిన కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు వెల్లడించారు.
అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ మద్యం, గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు గత రెండు దశాబ్దాలుగా సలబత్‌పూర్ చెక్‌పోస్ట్‌లో 24 గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు నిరంతరం విధులు నిర్వహిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు.రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ ట్రక్కులో ప్రయాణిస్తున్న యూట్యూబర్‌తో చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందికి మధ్య జరిగిన వాగ్వాదానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెంటనే ప్రాథమిక విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.విచారణలో ఘటనకు సంబంధించి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని గుర్తించినట్లు పేర్కొన్న ఆయన, శాఖాపరమైన పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని చెప్పారు.విచారణ నివేదికను కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (నోడల్ అధికారి)కి సమర్పించనున్నట్లు తెలిపారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు ముకుంద్ రెడ్డి వెల్లడించారు.విధి నిర్వహణలో నిబంధనలు, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, బాధ్యులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడంలో శాఖ ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించదని ఆయన స్పష్టం చేశారు.




# ఆఫీసర్స్ బి కేర్‌ఫుల్.. భారీ వర్షాలపై కలెక్టర్ హెచ్చరిక

- అత్యవసరమైతేనే సెలవులు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30(డిడి9 వార్త):**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా సెలవులు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా వర్షాల పరిస్థితిని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల ప్రభావంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో 08468 220069 నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను రక్షించేందుకు రోప్స్, డ్రోన్లు తదితర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు.అంటువ్యాధులు వ్యాపించే అవకాశాల దృష్ట్యా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ చేపట్టాలని పంచాయతీ శాఖ అధికారులను ఆదేశించారు. చెరువులు, కల్వర్టులు, కుంటల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పైకప్పులు లీకేజీ ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లలో ప్రజలు నివసించకుండా చర్యలు తీసుకోవాలని, వరదల కారణంగా రాకపోకలకు అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేయాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.వైద్యాధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని, పాముకాటు, సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులకు అవసరమైన మందులను అన్ని వైద్య కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని సూచించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై. గిరి, జడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**


జిల్లాలో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అందరూ తప్పనిసరిగా తమ తమ కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉండాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి జిల్లాలో వర్షాల వల్ల నెలకొన్న పరిస్థితులపై ఆయన గురువారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని, చెరువులు, వాగులు, జలాశయాల వద్ద నీటి మట్టాలను నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా వరద ఆటంకాలు లేదా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రజలు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08462 220183 కు సమాచారం అందించవచ్చని తెలిపారు. వరద ప్రమాదాలు చోటు చేసుకోకుండా రోడ్లపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో రవాణాను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి దారి మళ్లించాలని సూచించారు. తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడటంతో పాటు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఇదిలా ఉండగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను జిల్లాలో అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి గల్లంతు కాకూడదని, అదే సమయంలో డబుల్ ఓట్లు, మరణించిన వారు మరియు శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించి సమగ్ర పరిశీలన జరపాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ గీతతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# జీరో క్యాజువాలిటీస్ లక్ష్యంగా పని చేయాలి

- రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి డిజిపి సి.వి. ఆనంద్ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న వర్ష పరిస్థితులు, చేపడుతున్న రక్షణ, సహాయక చర్యలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో వర్ష పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు 24×7 పనిచేసే కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాలు, వరదల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇప్పటికే రాష్ట్ర విపత్తు స్పందన దళం, జాతీయ విపత్తు స్పందన దళం బృందాలను మోహరించి సిద్ధంగా ఉంచామని తెలిపారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాదకరంగా మారి కూలిపోయే స్థితిలో ఉన్న పాత భవనాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జలాశయాలు, చెరువులు, వాగుల పరిస్థితిని నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రహదారులపై వరద వల్ల రాకపోకలకు ఆటంకం కలగకుండా అత్యవసర 'ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్' సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పోలీస్ శాఖతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచిస్తూ, "జీరో క్యాజువాలిటీస్" లక్ష్యంగా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ అధికారులు తప్పనిసరిగా ప్రమాణిక నిర్వహణ విధానాలను (ఎస్‌ఓపీ) అనుసరించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని, అవసరమైన చోట ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పోలీస్ శాఖ ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ నుండి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీతతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# హసకొత్తూరు - బషీరాబాద్ మార్గంలో రాకపోకలు పునరుద్ధరణ

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై అడ్డంగా కూలిపోయిన భారీ వృక్షం ఇరు గ్రామాల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. కమ్మర్‌పల్లి మండల పరిధిలోని హాసకొత్తూరు, బషీరాబాద్ గ్రామాల సరిహద్దు రహదారిపై వర్షాల ధాటికి ఒక్కసారిగా పెద్ద చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

అయితే, చెట్టు పడిన ప్రాంతం హాసకొత్తూరు, బషీరాబాద్ గ్రామాల సరిహద్దుల్లో ఉండటంతోబాధ్యత ఎవరిదనే విషయంలో కాసేపు గందరగోళం నెలకొంది. సరిహద్దు పంచాయితీ కారణంగా తొలగింపు పనుల్లో కొంత ఆలస్యం జరగడంతో వాహనదారులు, స్థానికులు అవస్థలు పడ్డారు. సమస్య తీవ్రతను గుర్తించిన బషీరాబాద్ గ్రామపంచాయతీ పాలకవర్గం, చౌట్‌పల్లి సర్పంచ్ తక్షణమే స్పందించారు. సరిహద్దు వివాదాలను పక్కనబెట్టి ప్రయాణికుల సౌకర్యానికే ప్రాధాన్యమిస్తూ రంగంలోకి దిగారు. పంచాయతీ సిబ్బంది సాయంతో క్షేత్రస్థాయిలో శ్రమించి అడ్డంగా పడి ఉన్న చెట్టును విజయవంతంగా తొలగించారు. దీంతో రహదారిపై రాకపోకలు పునరుద్ధరణ జరిగి, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



# శ్రీరామ్‌సాగర్‌కు పోటెత్తుతున్న వరద


- 72 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్‌కు (ఎస్సారెస్పీ) భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జూలై 30 సాయంత్రం 6 గంటల సమయానికి ప్రాజెక్ట్‌లోకి ఏకంగా 72,452 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదువుతోందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి మట్టం 1066.6 అడుగుల (18.131 టీఎంసీలు) వద్ద ఉంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా, పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు. ఇక ప్రాజెక్ట్ నుంచి మొత్తం అవుట్ ఫ్లో 751 క్యూసెక్కులుగా కొనసాగుతోంది. ఇందులో కాకతీయ కాలువకు 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం 231 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 220 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. ప్రస్తుతానికి నదికి విడుదల చేసే స్పిల్‌వే, ఎస్కేప్ గేట్లతో పాటు వరద కాలువ గేట్లను తెరవలేదు. ఎగువ నుంచి ఇన్ ఫ్లో పెరుగుతుండటంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది.

# టిటిసి పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్‌ఎన్‌ఎస్ సెక్షన్ అమల్లో

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**



ఈ నెల 2న జరగనున్న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్‌ఎన్‌ఎస్ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య గురువారం ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో జనాలు గుమికూడటంపై నిషేధం ఉంటుందన్నారు. అలాగే పరిసరాల్లోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఆంక్షలను కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

# అంబేడ్కర్ వర్సిటీ నూతన కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ
- ఆగస్టు 7 వరకు అడ్మిషన్లకు గడువు

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**



డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందిస్తున్న నూతన కోర్సులను విద్యార్థులు, ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ ఈఎంఆర్‌ఆర్‌సి డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వెంకటరమణ సూచించారు. నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలోని విశ్వవిద్యాలయ ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో గురువారం యూజీ, పీజీ అడ్మిషన్ల ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ.. నిజామాబాద్ స్టడీ సెంటర్ ద్వారా ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 400 వరకు అడ్మిషన్లు పూర్తయ్యాయని తెలిపారు. వచ్చే ఆగస్టు 7వ తేదీ వరకు ప్రవేశాలు పొందేందుకు అవకాశం ఉందని ఆసక్తి ఉన్నవారు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గతేడాది నుంచి నిజామాబాద్ కేంద్రంలోనే బి.ఎల్.ఐ.ఎస్సీ, పీజీ సైన్స్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని, వీటి తరగతులతో పాటు ప్రాక్టికల్స్‌ను కూడా ఇక్కడే నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ కె.రంజిత మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో ప్రవేశాలు ప్రతియేటా పెరుగుతున్నాయని గత సంవత్సరం 2,324 మంది విద్యార్థులు చేరగా ఈసారి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రవీణ్ రెడ్డి, సిబ్బంది రాధ, బిందు, ప్రేమ్‌సింగ్, రజిత పాల్గొన్నారు.

# పెగడపల్లిలో వర్షా నికి కూలిన ఇల్లు

- బాధితులను పరామర్శించిన తహసీల్దార్ విఠల్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**



బోధన్ మండలంలోని పెగడపల్లిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ఎరాజ్‌పల్లి దేవయ్య అనే నిరుపేద నివాస గృహం పూర్తిగా కూలిపోయింది. ప్రమాద సమయంలో ఇంట్లోని కుటుంబ సభ్యులు అప్రమత్తమై వెంటనే బయటకు పరుగులు తీయడంతో పెద్ద ముప్పు తప్పి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కాగా, నివాసం నేలమట్టం కావడంతో ఇంట్లోని నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు ధ్వంసమై ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందుల పాలైంది. సమాచారం అందుకున్న బోధన్ తహసీల్దార్ విఠల్ గురువారం సంఘటనా స్థలానికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. జరిగిన నష్టంపై తక్షణమే నివేదిక సిద్ధం చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధిత కుటుంబానికి అందాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందిస్తామని హామీ ఇచ్చారు. నిరాశ్రయులైన ఆ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయంతో పాటు ప్రత్యామ్నాయ నివాస సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు.

# భారీ వర్షా నికి కూలిన ఇల్లు.. తప్పిన ప్రాణాపాయం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**



సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఒక నివాస గృహం పూర్తిగా కూలిపోయింది. వర్షాల ధాటికి ఇంటి శ్లాబ్‌తో పాటు రేకులు, గోడలు ఒక్కసారిగా నేలమట్టమయ్యాయి. ప్రమాదాన్ని ముందుగానే గమనించిన కుటుంబ సభ్యులు త్వరితగతిన బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పి, ప్రాణాపాయం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఇల్లు కూలిపోవడంతో నివాసం లేక బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇల్లు కోల్పోయి రోడ్డున పడ్డ సదరు పేద కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించాలని, ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని ఖాజాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ మండలంలోని పలు బాధిత కుటుంబాలను నేరుగా కలిసి పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెబుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీకుమార్‌కు ఇటీవల గుండె ఆపరేషన్ జరగడంతో సునీల్ కుమార్ ఆయన నివాసానికి వెళ్లారు. శ్రీకుమార్‌ను పరామర్శించి, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉప్లూర్ గ్రామానికి చెందిన బషీర్ మోహన్ తండ్రి రాజన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి గృహాన్ని సందర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, కుటుంబ సభ్యులను పరామర్శించి తన గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, పిఎంజెఎఫ్ లయన్ 'అన్నబంధు' బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి అధ్యక్షుడు లయన్ తెడ్డు రమేష్ మాట్లాడుతూ.. బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలోని నిరుపేదలకు, బాధితులకు ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తూ ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని, ఆయన సేవాస్ఫూర్తి కొనియాడదగినదని అన్నారు. వారి పుట్టినరోజున అన్నదానం నిర్వహించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఆయన స్ఫూర్తితో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ లుక్కా గంగాధర్, ప్రధాన కార్యదర్శి లయన్ ఎండి హైమద్, కోశాధికారి లయన్ సుంకరి విజయ్ కుమార్, సభ్యులు పాలేపు నర్సయ్య, సున్నం మోహన్, చింత ప్రదీప్, బద్దం రాజశేఖర్, పడిగేలా ప్రవీణ్, నోముల నరేందర్, సుర నర్సయ్య, గుందోజి రవీందర్, గోపిడి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# 11 మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి

- అభినందించిన సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 11 మంది అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లకు సబ్ ఇన్స్పెక్టర్లుగా పదోన్నతి లభించింది. ప్రమోషన్ పొందిన అధికారులు గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ వారికి శుభాకాంక్షలు తెలియజేసిbనూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రమోషన్లు రావడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతి పొందిన వారిలో బి.జాన్సన్ మహిళా పీఎస్, జి.రాజేశ్వర్‌రెడ్డి వేల్పూర్ పీఎస్, వి.అనిల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి ట్రాఫిక్ పీఎస్, బి.సాయిలు టౌన్2 పీఎస్, ఎం.డి. లాయక్ అలీ టౌన్4 పీఎస్, డి.చిన్న గంగారం టౌన్1 పీఎస్, ఎస్.కె.గఫర్ నవీపేట్ పీఎస్, కె.బాబూరావు బోధన్ టౌన్ పీఎస్, పి.శంకర్ జక్రన్‌పల్లి పీఎస్ మరియు రేణుకా దేవి రుద్రూర్ పీఎస్ ఉన్నారు.




# వికసిత్ భారత్' జలసిరి పనులను విజయవంతం చేయాలి

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా 'వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ గ్రామీణ్' పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమాలపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.సదాశివ్ తెలిపారు. జూలై 29, 30 తేదీల్లో ఈ పనులపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం సూచించడంతో మండలంలోని 8 గ్రామ పంచాయతీలైన కోనసముందర్, హాసకొత్తూర్, అమీర్‌నగర్, నర్సాపూర్, ఇనాయత్‌నగర్, కోనాపూర్, రాజరాజేశ్వరీనగర్ మరియు దొమ్మర్‌చౌడ్ తండాలలో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోనసముందర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో సదాశివ్ పాల్గొని మాట్లాడారు. భూగర్భ జలమట్టాలను పెంచేందుకు జలసిరి పనులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రతి గ్రామంలోని పంట పొలాల్లో 5 పంట కుంటలు, ప్రతి ఇంటికి తప్పనిసరిగా ఒక ఇంకుడు గుంత, ఊరి పరిధిలో ఒక ఊట కుంట నిర్మించాలని స్పష్టం చేశారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. మహిళా సమాఖ్య సంఘాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామాల్లో ఈ నీటి సంరక్షణ నిర్మాణాలను పూర్తి చేయించాలని కోరారు. ఈ గ్రామసభల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రత్యేక అధికారులు, గ్రామ సంఘాల సభ్యులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రత్యేక పాఠశాల విద్యార్థులక అన్నప్రసాద వితరణ

**నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో స్థానిక చెవిటి, మూగ పిల్లల పాఠశాలలో గురువారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ మాజీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి. బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ కిరీట కుమారి, శాంతమూర్తిలతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం అధ్యక్షుడు రఫీ, కార్యదర్శి అంబల తిరుపతి, ప్రోగ్రామ్ చైర్మన్ వెంకట్రాం రెడ్డి, కోచైర్మన్ ఉదయ్, క్లబ్ సభ్యులు పృథ్వీరాజ్, నరసింహారెడ్డి, విజయానంద్, లోచర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# వర్షపు నీటిని ఒడిసిపడదాం.. భూగర్భ జలాలను పెంచుకుందాం..

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

భూగర్భ జలమట్టాలను గణనీయంగా పెంచి, వర్షపు నీటి ప్రతి బొట్టునూ సంరక్షించడమే ధ్యేయంగా సాలూర మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'జలసిరి' ప్రత్యేక గ్రామసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అజ్మత్ నవాజ్, సర్పంచ్ లావణ్య పాల్గొని జల సంరక్షణ చర్యలు, బోర్వెల్ రీఛార్జ్ గుంటల ఆవశ్యకతపై గ్రామస్తులకు, రైతులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అజ్మత్ నవాజ్ మాట్లాడుతూ... వర్షాకాలంలో ప్రవహించే నీటిని వృథాగా పోనీయకుండా ఇంకుడు గుంటలు, రీఛార్జ్ నిర్మాణాల ద్వారా నేరుగా భూగర్భంలోకే మళ్లించాలని సూచించారు. నీరు అడుగంటిన ప్రతిసారీ లక్షల రూపాయలు వెచ్చించి కొత్త బోర్లు తవ్వించడం కంటే, ఉన్న బోరు బావుల వద్ద రీఛార్జ్ గుంటలు ఏర్పాటు చేసుకుంటే తక్కువ ఖర్చుతో ఏడాదంతా సమృద్ధిగా నీరు అందుతుందని స్పష్టం చేశారు. అనంతరం సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ...'ఉపాధి హామీ పథకం' సాంకేతిక, ఆర్థిక సహాయంతో గ్రామంలోని రైతులందరూ తమ పొలాల్లో బోర్వెల్ రీఛార్జ్ గుంటలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. రైతులతో పాటు ప్రతీ ఇంటా ఇంకుడు గుంట ఏర్పాటు చేయడంతో పాటు, స్థానిక నీటి వనరులు, కాలువల్లో పూడిక తీసే



పనులను వేగవంతం చేసి గ్రామాన్ని జల సమృద్ధిగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేష్ పటేల్, కార్యదర్శి ప్రవీణ్, ఉపాధి హామీ సిబ్బంది, వార్డు సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మండలగూడెం పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

- **ఉపాధ్యాయుల కొరతపై సర్పంచ్ వినతి**

**జనగణమన జూలై 30(డిడి 9వార్త )బ్యూరో**

రఘునాథపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రఘునందన్ రెడ్డి మండలగూడెం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల అభ్యాస స్థాయిపై పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డ్యాగల రాజశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో ఆరు ఉపాధ్యాయ పోస్టులు మంజూరై ఉండగా ప్రస్తుతం ఒక ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం, ఇద్దరు ఎస్‌జీటీలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 70 మంది విద్యార్థులకు బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నందున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే మరో ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బి. కొమురయ్య, వార్డు సభ్యులు ముప్పిడి లక్ష్మణ్, లావణ్య, మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అమ్ధాపూర్‌లో వాన ధాటి.. దెబ్బతిన్న ఇళ్లు, రోడ్లు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

బోధన్ మండలం అమ్ధాపూర్ గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల ధాటికి గ్రామంలోని పలు ఇళ్లు దెబ్బతిని కూలిపోగా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ జలమయమైంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ పోరెడ్డి గంగాధర్ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి గురువారం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన సర్పంచ్.. బాధితులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం గ్రామంలో నిలిచిపోయిన వర్షపు నీటిని, నిండిపోయిన డ్రైనేజీలను పంచాయతీ సిబ్బందితో కలిసి పునరుద్ధరించారు. డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తొలగించి సమస్యలను తక్షణమే పరిష్కరించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కూనింటి రాజు, నర్రా సుధాకర్, సమీరుద్దిన్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్రా పల్లన్న, కార్యదర్శి రంజిత్, జీపీఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# వర్షా ల వేళ అప్రమత్తంగా ఉండాలి

- **లింగాల జగదీష్ చందర్ రెడ్డి**

**జనగామ, జూలై 30 (డీడీ9 వార్త)బ్యూరో**

రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి కోరారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, వంకలు, చెరువులు, వరద ప్రవాహాలను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలవకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, తెగిపడిన విద్యుత్ తీగలు, శిథిల భవనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు,



గర్భిణీలు, రైతులు ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తూ వాతావరణ శాఖ, స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు.

# భారీ వర్షాల ముప్పు.. అత్యవసరమైతేనే బయటకు రావాలి

- **సాలూర మండల ప్రజలకు తహసీల్దార్ నవాజ్ విజ్ఞప్తి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

సాలూర మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ తీవ్ర అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అజ్మత్ నవాజ్ అన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలైన మందర్నా, హున్సా, ఖాజాపూర్, తగ్గెలి గ్రామాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాగులు, నదుల్లో నీటి ఉధృతి పెరిగినందున చేపలు పట్టేందుకు గానీ, చూసేందుకు గానీ నీటి ప్రవాహాల వద్దకు ఎవరూ వెళ్లకూడదని స్పష్టం చేశారు. వర్షాల ధాటికి ఇళ్లు దెబ్బతిన్న వారు, కూలిపోయే ప్రమాదం ఉన్న పాత నివాసాల్లో ఉంటున్న వారు తక్షణమే బంధువుల ఇళ్లకు లేదా సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తర



లివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేసే వారు తెగిపడిన విద్యుత్ తీగలు, కూలిన స్తంభాలు, దెబ్బతిన్న రహదారులు మరియు కూలిపోయే స్థితిలో ఉన్న చెట్ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే చిన్నపిల్లలు, వృద్ధులు పొరపాటున కూడా వరద నీటి వైపు వెళ్లకుండా కుటుంబ సభ్యులు తగిన పర్యవేక్షణ వహించాలని చెప్పారు. ఏదేని ఆపద లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే తక్షణమే స్థానిక రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాలతో తెగిపోయిన రోడ్డును పరిశీలించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

**మంగపేట జూలై 30డీడీ 9 వార్త**

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం శనగకుంట, నర్సింహసాగర్ గ్రామాల్లో పర్యటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నర్సింహసాగర్ పీఆర్ రోడ్డు మార్గం ద్వారా శనగకుంట గ్రామానికి వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న వంతెన పక్కన రహదారి తెగిపోయి రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలుసుకున్న చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని సంబంధిత పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అత్యవసర మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి తాత్కాలిక రహదారి సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలని అధికారులను కోరారు. ప్రజా సమస్యల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని సూచించారు. అనంతరం నర్సింహసాగర్ గ్రామంలోని ఐబీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న బాధితులను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి, భారీ వర్షాల వల్ల వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కష్టాలు తెలుసుకోవడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించడం కాంగ్రెస్ పార్టీ నాయకుల బాధ్యత అని చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

బాధితులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురాగా, వాటన్నింటినీ మంత్రి ధనసరి అనసూయ సీతక్క దృష్టికి నేరుగా తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. మంగపేట మండల ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలిచి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం పార్టీ నిబద్ధత అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ఆత్మ కమిటీ సభ్యులు గాదె శ్రావణ్ కుమార్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, జిల్లా నాయకులు మాసిరెడ్డి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, జిల్లా నాయకులు కాటేబోయిన నరసింహారావు, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ యర్రంగారి సురేష్, అన్నాల వెంకన్న, దోమల నరేందర్, సాయిరీ సత్యం, మండల మీడియా ఇంచార్జ్ బసారీకారి నాగార్జున్, మండల నాయకులు గూడూరు రంజిత్, బొడ్డు సుధాకర్, బోదేబోయిన హనుమంత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

**భద్రాచలం టౌన్ , జూలై 30 ( డిడి9 వార్త )**

భద్రాచలంలో కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను భద్రాచలం గ్రామ సర్పంచ్ కృష్ణదొర ఒలింపిక్ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది అథ్లెట్లు పాల్గొనడం జరిగిందన్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు అత్యధిక పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతాజీ మాట్లాడుతూ, ఈ పోటీల్లో అధిక సంఖ్యలో గిరిజన క్రీడాకారులు పాల్గొనడం ఎంతో నందదాయకమన్నారు, భవిష్యత్తులో వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కా



ర్యదర్శి కె. మహీధర్ మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన 40 మంది అథ్లెట్లను ఎంపిక చేసి, వచ్చే నెల 7వ తేదీన హనుమకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు జిల్లా తరఫున పంపనున్నట్లు తెలిపారు. అనంతరం క్రికెట్ గ్రౌండ్ నిర్వహకులు సిద్ధారెడ్డి విజేతలకు పతకాలు ప్రదానం చేసి అభినందించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కన్వీనర్ జి. గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర పర్యవేక్షించగా, అథ్లెటిక్స్ కోచ్ లు నాగరాజు, మల్లికార్జున్, శ్వేత, విజయలక్ష్మి, అసోసియేష కోశాధికారి బి హనుమంతరావు నిర్వహించారు.

# గ్రీన్ డే సెలెబ్రేషన్స్ లో షైన్ హై స్కూల్ చిన్నారులు

- **ఆకుపచ్చనీ దుస్తులు,ఆకృతులతో చిన్నారుల ప్రదర్శన**

**బోనకల్,జూలై 30,(డీడీ9 వార్త):**

మండల కేంద్రంలోని షైన్ హై స్కూల్ లో గ్రీన్ డే సంబరాలు అంబరాన్ని అంటాయి..చిన్నారుల ఆటపాటలతో పాఠశాల వాతావరణం పండుగలా మారింది... విద్యార్థులకు ప్రకృతిని పరిరక్షించే విధంగా ఎలా ఉండాలో చెబుతూ మొక్కలు నాటించారు.. పాఠశాల కరెస్పాండంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించే విధంగా నీటిని వృధా చేయకుండా ఉండటం, ప్లాస్టిక్ నివారణ,చెట్లను నరకకుండా ఉండటం, చెత్త కుండీలు వాడటం, పరిసరాల శుభ్రత మొదలగు అంశాల మీద పూర్తిస్థాయిలో పాఠశాలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కరెస్పాండంట్ షేక్ అన్సర్ పాషా,ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత,అడ్మినిస్ట్రేటర్ డేగల వేలాద్రి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.





# వికలాంగుల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు వాయిదా

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

ఈ నెల 31 నుండి ఆగష్టు 2 వరకు బోధన్ పట్టణంలో నిర్వహించాల్సిన వికలాంగుల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య వెల్లడించారు. బోధన్‌లోని అప్నా గార్డెన్‌లో గురువారం నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వికలాంగులు శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతోనే వాయిదా వేసినట్లు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నూతన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ఇప్పటివరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. బస్వరాజు పాటిల్, జిల్లా అధ్యక్షులు గైని రాములు, జిల్లా కార్యదర్శి యేశాల గంగాధర్, జిల్లా కోశాధికారి రామ్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, దేవదాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# బోధన్ లో చెరువును తలపిస్తున్న ప్రెస్ కాలనీ

- **రోడ్లపై నిలిచిన వర్షపు నీరు.. జలమయమైన వీధులు**
- **తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులకు కాలనీవాసుల విజ్ఞప్తి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 30 (డీడీ9 వార్త) :**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీ పెగడపల్లి రోడ్డులోని ప్రెస్ కాలనీ జలమయమైంది. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్లపైనే నిలిచి, వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అక్కడ నివసిస్తున్న జర్నలిస్టులు, కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లపై మోకాలు లోతు నీరు చేరడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనులపై బయటకు వెళ్లే ప్రజల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. నీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దోమల తీవ్రత పెరిగిపోవడంతో పాటు ఇళ్లలోకి పాములు వస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమించిన ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని, రోడ్లపై నిలిచిన నీటిని తొలగించి, శాశ్వత పరిష్కారంగా మురుగు నీటి కాలువలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.




# చక్రేశ్వర శివాలయం హుండీ ఆదాయం ₹1.39 లక్షలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, (డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో ఆలయ హుండీలను ఎండోమెంట్ ఇన్ స్పెక్టర్ సుజాత రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల సమక్షంలో విప్పడం జరిగింది. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో బోధన్ వాసవి క్లబ్ సభ్యులు కూడా పాల్గొని సేవలందించారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఆలయానికి మొత్తం ₹ 1 లక్ష 39 వేల 192లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాములు, అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మణ్ పటేల్, ఏ. శంకర్, ఈ. మౌనిక పోశెట్టి, గంగాధర్, ఆలయ అర్చకులు గణేష్ శర్మ, మహేష్, ఆలయ సిబ్బంది సుధాకర్ మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.




# పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో

- **దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు పూర్తి.**
- **నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు.**
- **ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 31:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్సు డిపో పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి పరిశీలించడం జరిగింది అని దసరా వరకు పెద్దపల్లి బస్సు డిపో ప్రారంభించే దిశగా పనులు త్వరత్వరగా జరిగేల ఎం.డి అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు తెలిపారని అన్నారు. బస్సు డిపో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లల్లో బస్సు డిపో ఉన్నప్పటికీ మొదటి నుండి పెద్దపల్లి కూడా రెవెన్యూ డివిజన్ అయినప్పటికీ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డిపో లేకపోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయమని వినతి పత్రం అందజేసిన తర్వాత వారు పెద్దపల్లి ప్రజలపై ఉన్న మమకారంతో వారు 2024 డిసెంబర్ మాసంలో పెద్దపల్లి ప్రాంతానికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి బస్సు డిపోను దసరా వరకు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఎండీ తెలిపారని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ అధికారులు, పట్టణ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఆర్‌డీఎస్ ఎఫ్‌టీఈ ఉద్యోగుల నల్ల బ్యాడ్జీలతో నిరసన

**మంగపేట జూలై 30డీడీ 9 వార్త**

రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు ఎస్ఆర్‌డీఎస్ (వీబీజీ-రామ్‌జీ) ఎఫ్‌టీఈ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. పే స్కేలు అమలు, మూడు నెలల పెండింగ్ వేతనాల తక్షణ విడుదల, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీ అమలు తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మొహమ్మద్ అంకుస్, టెక్నికల్ అసిస్టెంట్లు నాయకపు శిరీష, బొల్లా సతీష్, ఏడుల్లా రాంబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు అడ్డూరి శ్రీకాంత్, ఏఎస్‌యూ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.

- **అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి.**




**డిడి9వార్త / రామగుండం జులై 31:**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి,మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

**భారీ వర్షా ల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు**

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు.

ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని,సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని సూచించారు.

ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ తరపున అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు పోలీసుల సూచనలు, సలహాలను పాటిస్తూ సహకరించాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు,కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ల రాదు.

చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తాకరాదు.

ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులు,నాలాలు, డ్యామ్‌లు, జలపాతాలు (వాటర్ ఫాల్స్) వద్దకు వెళ్లరాదు.చేపల వేట కోసం కూడా వెళ్లకూడదు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలి.

స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్,ఆర్అండ్‌బీ, వైద్య శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ,వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఇరువైపులా బ్యారికేడ్లు,ప్లాస్టిక్ కోన్‌లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు,అలుగులు, ప్రధానరహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు అధికారులు,సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వరద నీటి కారణంగా చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.కాబట్టి నెమ్మదిగా, అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.

కల్వర్టులు,చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు.

ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని, పోలీసు సిబ్బంది 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ ను సందర్శించిన.. రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు శ్రీమతి పావని గౌడ్.

**మణుగూరు.జూలై 30(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు శ్రీమతి పావని గౌడ్ BG కొత్తూరు పరిధిలో ఉన్నటువంటి సీతారామ ప్రాజెక్ట్ పంపు హౌస్ ను సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులలో సీతారామ ప్రాజెక్ట్ ఒకటని ఆమె పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించి రైతాంగ అభివృద్ధికి బాటలు వేస్తుందని చెప్పారు. అనంతరం స్థానిక బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష & కార్యదర్శులు కోడి అమరేందర్ యాదవ్,మర్రి మల్లారెడ్డి లు మాట్లాడుతూ,

సీతారామ ప్రాజెక్ట్ (పంప్ హౌస్ ) ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా మరియు తెలంగాణ రైతులందరికి సాగునీరు అందించి సస్యశ్యామలం చేయడం చాలా ఆనందదాయకం అని అన్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్నటువంటి రైతులకు గోదావరి జలాలతో చివరి ఎకరం తడిసే వరకు BRS పోరాటం కొనసాగుతుందని వారు తెలియజేశారు.అదేవిధంగా అమలు గాని 6 గ్యారంటీలు 420 హామీలతో ప్రభుత్వాన్ని ఏర్పరిచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజానీకం సరైన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి,సీనియర్ నాయకుడు జాలే రామకృష్ణారెడ్డి,సర్పంచులు మర్రి సంధ్య,కోర్స అలివేలు,మండ్రు రామకృష్ణ,కోండ్రు సోమయ్య,మాజీ సర్పంచ్ కోడి కృష్ణవేణి,మండల యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ,మండల SC సెల్ అధ్యక్షులు& ఉప సర్పంచ్ చల్లా రాజేష్,మండల బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివారపు డాక్టర్ బాబు ,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుంపెన శ్రీను,మాజీ ఎంపీటీసీ గొర్రెముచ్చు వెంకటరమణ,నాయకులు కడారి వేణు,మందా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.







# మున్సిపల్ నిర్లక్ష్యమే నగరాన్ని ముంచేసింది..!

- **వరదలపై మున్సిపల్ వైఫల్యం బట్టబయలు..!**
- **ముందస్తు చర్యలు లేక ప్రజలు వరద కష్టాల్లో – మద్దెల దినేష్ ధ్వజం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 30 (డీడీ9 వార్త):**

వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆరోపించారు.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన మురికి కాలువలు, డివిజన్లలోని డ్రైనేజీలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నుంచి ముందస్తుగా పూడికలు తొలగించకపోవడం వల్లే నగరంలో వరద పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. వర్షాలు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.






ప్రధాన కాలువల పక్కన అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు, కాలువల ఆక్రమణలను తొలగించేందుకు రామగుండంలో ప్రత్యేకంగా "హైడ్రా" తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## భారీ వర్షా ల బాధితులకు వెంటనే ఉచిత 'ఇందిరమ్మ ఇళ్లు' నిర్మించి ఇవ్వాలి: ఏఐటీయూసీ డిమాండ్

- **ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు రూ.50 వేల తక్షణ సాయం**
- **రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 30 (డీడీ9 వార్త):**




రామగుండం నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇళ్లు, గోడలు కూలి నిరాశ్రయులైన పేద కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏఐటీయూసీ రామగుండం నగర సమితి అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

భారీ వర్షాలతో ఇళ్లు కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా 'ఇందిరమ్మ ఇళ్లు' నిర్మించి ఇవ్వాలని వారు కోరారు. అలాగే ప్రతి నిరాశ్రయ కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.50 వేల ఆర్థిక సాయం అందించి, బాధితులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఇళ్లను కోల్పోయి సర్వస్వం నష్టపోయిన కుటుంబాలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆహారం, తాగునీరు, నిత్యావసర వస్తువులను ప్రభుత్వం అత్యవసరంగా అందించాలని వారు కోరారు. అంతులేని వర్షాల కారణంగా రామగుండం నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొంటూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేసి, రైతులకు ఎకరాకు రూ.50 వేల పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని, లేనిపక్షంలో బాధితుల తరఫున పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏఐటీయూసీ రామగుండం నగర సమితి నాయకులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్ హెచ్చరించారు.



## సింగరేణి కార్మికులకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి

- **క్వార్టర్లలో నిలిచిన వరద నీటిని తొలగించి సహాయక చర్యలు చేపట్టాలని కార్మిక కుటుంబాల విజ్ఞప్తి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 30 (డీడీ9 వార్త):**

భారీ వర్షాల నేపథ్యంలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని కార్మిక కుటుంబాలు యాజమాన్యాన్ని కోరాయి. ఆర్జీ1 ఏరియాలోని జీఎం కాలనీలో టీ2/153, టీ2/154తో పాటు పలు క్వార్టర్లలో వర్షపు నీరు నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నాయి. క్వార్టర్లలో నిల్వ నీటిని వెంటనే తొలగించి, అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశాయి.

## భారీ వర్షా ల నేపథ్యంలో డివిజన్‌లో కార్పొరేటర్ సాగి సంతోష్ రావు పర్యటన

- **వర్షంలోనే ప్రజల మధ్యకు..**
- **ప్రజల ఇబ్బందులను నేరుగా వివరించిన డా. రవికుమార్ నాగండ్ల, రాచర్ల శ్రీనివాస్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 30 (డీడీ9 వార్త):**

రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 49వ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీలో కార్పొరేటర్ సాగి సంతోష్ రావు పర్యటించి పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు డా. రవికుమార్ నాగండ్ల, జనరల్ సెక్రటరీ రాచర్ల శ్రీనివాస్‌తో కలిసి ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఓపెన్ నాలాలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిన విషయాన్ని గుర్తించి, వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అనంతరం జేసీబీ సహాయంతో నాలాను శుభ్రపరచించి నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టారు.

అదే విధంగా, కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరుతున్నట్లు సమాచారం అందడంతో బాధిత ప్రాంతాలను స్వయంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి నీరు వేగంగా బయటకు వెళ్లేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగి సంతోష్ రావు మాట్లాడుతూ.... భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే తమను లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు వెంకట్ రాజం, తిరుపతిరావు, ప్రవీణ్ కుమార్, బొల్ల మల్లేష్, పెరిక స్వామి, అలిశెట్టి రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షా ల నేపథ్యంలో పినపాక నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

- **పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూలై 30(డి డి 9వార్త)**



వాతావరణ శాఖ రానున్న 36 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పినపాక నియోజకవర్గ ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు.భారీ వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలు అనవసర ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులు తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా వెంటనే స్పందించి ప్రజలకు సహాయం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.వాగులు,వంకలు,చెరువులు, కాలువలు ఉప్పొంగుతున్న సమయంలో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా, రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సంరక్షణపై ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని, పశుసంవర్ధక శాఖ అధికారులు పశువుల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పినపాక నియోజకవర్గ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా స్థానిక అధికారులకు వెంటనే సమాచారం అందించి, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సోను సూద్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

**జనగామ జూలై 30(డిడి 9 వార్త )బ్యూరో**

మహబూబ్ నగర్ లో సోను సూద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోను సూద్ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం, లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ మాట్లాడుతూ, రక్తదానం మహాదానమని, అత్యవసర సమయంలో రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. సమాజ సేవలో సోను సూద్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు.




కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, జిల్లా అధ్యక్షుడు కేతూరి శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సి. సతీష్, పట్టణ అధ్యక్షుడు ఎస్. నాగరాజు, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సి. మనోహర్, ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ గౌడ్, ఇతర సభ్యులు, వైద్యులు, న్యాయవాదులు, మహిళలు, మేధావులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా నీడిగొండ–కిలేషాపూర్ రహదారి

**జనగామ, జూలై 30 (డీడీ9 వార్త):**



శంకుస్థాపనకే పరిమితమైన రహదారి పనులు నీడిగొండ-కిలేషాపూర్ రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇబ్రహీంపూర్ గ్రామ బీజేపీ కంటెస్టెడ్ సర్పంచ్ దొరగొల్ల రవి తెలిపారు. స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రెండేళ్ల క్రితం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాల ముప్పు పెరిగిందని పేర్కొంటూ, అధికారులు వెంటనే స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

DD9 వార్త తెలుగు దినపత్రిక

# బీటీపీఎస్ బూడిదతో బతుకులు బూడిదే..!

- **పినపాక, మణుగూరు సరిహద్దు గ్రామాలపై కాలుష్య ముసురు.**
- **పెరుగుతున్న శ్వాసకోశ సమస్యలు.**
- **తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి.**

**మణుగూరు.జూలై 30(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, పినపాక మండలాల సరిహద్దు గ్రామాల్లో భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బిటిపిఎస్) నుండి వెలువడుతున్న బూడిద కాలుష్యం స్థానిక ప్రజల జీవితాలను తీవ్ర అశాంతికి గురిచేస్తోంది. రోజూ కురిసే బూడిద వర్షంతో పరిసర గ్రామాలు కాలుష్య ముసురులో చిక్కుకున్నాయి. "కరెంటు వెలుగులు ప్లాంట్ లో నిండుతుంటే.. మా బతుకులు మాత్రం బూడిదపాలవుతున్నాయి" అని సరిహద్దు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతిరోజూ ఇళ్లపై బూడిదే.!**

ప్లాంట్ నుంచి వెలువడుతున్న సూక్ష్మ బూడిద కణాలు గాలిలో కలిసి చుట్టుపక్కల గ్రామాలపై పడుతున్నాయి. ఇళ్ల ప్రాంగణాలు, తాగునీటి గుంటలు, చివరికి వండుకునే ఆహార పదార్థాల పై సైతం బూడిద పొరలు పేరుకుపోతున్నాయి. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు దుమ్ము, బూడిదను వదిలించుకోవడమే సరిపోతోందని గృహిణులు వాపోతున్నారు.

**హెచ్చరిస్తున్న శ్వాసకోశ సమస్యలు!**

ఈ బూడిద కాలుష్యం కారణంగా గ్రామీణుల్లో, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులలో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు శరవేగంగా పెరుగుతున్నాయి. ఆస్తమా, నిరంతరం దగ్గు, చర్మ సంబంధిత అలర్జీలు, కంటి మంటలతో ప్రజలు ఆసుపత్రుల బాట పడుతున్నారు. కాలుష్య తీవ్రత ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర ఆరోగ్య ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు.

**హరితవనం లేక మరింత ఇబంధులు!**

సాధారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల చుట్టూ దట్టమైన మొక్కలతో గ్రీన్ బెల్ట్ (హరితవనం) ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే, ఇక్కడ సరైన రీతిలో హరితహారం లేదా చెట్ల పెంపకం చేపట్టకపోవడంతో బూడిద గాలికి సులువుగా కొట్టుకొచ్చి పరిసర గ్రామాలను ముంచెత్తుతోంది. యాష్ పాండ్ల నిర్వహణలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, గాలి వీచినప్పుడు నీటిని పిచికారీ చేయకపోవడం వల్ల పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది.

**అధికారులు స్పందించాలి!**

తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ కాలుష్య సమస్యపై కాలుష్య నియంత్రణ మండలి (పి సి బి) మరియు బిటిపిఎస్ యాజమాన్యం తక్షణమే స్పందించాలని మణుగూరుపినపాక సరిహద్దు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. యాష్ పాండ్లలో నీటి పిచికారీ శాతాన్ని పెంచాలని, ప్లాంట్ చుట్టూ దట్టమైన చెట్లతో హరితవనం నిర్మించాలని, అలాగే ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.






## భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చిన డిపో యూత్

- **సామాజిక బాధ్యతే ధ్యేయం.. స్వచ్ఛందంగా గోతులు పూడ్చిన డిపో యూత్**
- **అభినందించిన ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి**

**భద్రాచలం, జూలై 30 (డిడి9 వార్త)**

భారీ వర్షాలు, నిత్యం రాకపోకలు సాగించే బరువైన లారీల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులను డిపో యూత్ సభ్యులు స్వచ్ఛందంగా పూడ్చివేశారు. వాహనదారులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన యువకులు.. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమం చేపట్టడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. చర్ల రోడ్డులోని రాధ హాస్పిటల్ సమీపం, అంబేద్కర్ సెంటర్, అలాగే పాత మార్కెట్ ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన గుంతలను కంకర, సిమెంట్ సహాయంతో నింపి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ సందర్భంగా డిపో యూత్ సభ్యులు మాట్లాడుతూ.. తాము చేపట్టింది తాత్కాలిక పరిష్కారమేనని, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రధాన రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యువకుల సేవాభావాన్ని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి స్వయంగా పరిశీలించి అభినందించారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు యువతలో బాధ్యతను చాటుతాయని, ఇతరులకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో యూత్ సభ్యులు కుంజా సంతోష్, కొప్పుల మురళీ, పండా అమృతరావు (అంబు), తాళ్ళ నాగరాజు, గజ్జెల ఖాసీం, బోళ్ల కృష్ణ, తాళ్ళ శివ, సవలం వంశీ, నాగార్జున, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## విద్య నిజమైన సంపద.. చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ..

**జూలై30 డిడి9 వార్త వెంకటాపురం.**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ఉప్పెడు వీరాపురం గ్రామపంచాయతీ పరిధిలోని టేకుల బోరు గ్రామంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పాస్టర్ సోలోమన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టేకుల బోరు, తురసవాని గూడెం, వెంగళరావుపేట గ్రామాలకు చెందిన చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేసి, విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని వక్తలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో రామ్ సార్, మురళి రెడ్డి, ఉపసర్పంచ్ గుండెల ప్రశాంత్, వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు చిట్యాల సాగర్తో పాటు పలువురు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.




## 14వ వార్డులో పడకేసిన పారిశుధ్యం

- **కొత్త కాలనీలో అరణ్యాన్ని తలపిస్తున్న జనవాసాలు**
- **సీపీఎం పట్టణ కార్యదర్శి ఎరంశెట్టి వెంకట రామారావు**

**భద్రాచలం టౌన్ , జూలై 30 ( డిడి9 వార్త )**

భద్రాచలంలోని 14వ వార్డు పరిధిలోని అశోక్ నగర్ కొత్త కాలనీలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్య ఫలితంగా పారిశుధ్యం పడకేసిందని జనవాసాలు అడవిని తలపిస్తున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట్రామారావు ఆరోపించారు. గురువారం 14వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో అశోక్ నగర్ కొత్త కాలనీలో జనావాసాల మధ్య విచ్చలవిడిగా పెరిగిన చెట్లను పొదలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట రామారావు మాట్లాడుతూ ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలలో అడవిని తలపించే విధంగా చెట్లు మొదలు పెరిగిపోయిన పంచాయితీ అధికారులు గానీ స్థానిక ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడంలేదని విమర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో ఇళ్ల మధ్య చెట్లు పెరిగి విషసర్పాలు ప్రమాదకరంగా సంచరిస్తున్నాయని అన్నారు. ఖాళీ స్థలాలలో చెట్లు పెరిగిపోతున్నాయని గతంలో పలుమార్లు పంచాయతీ అధికారులకు స్థానిక ప్రజలు విన్నపించిన స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికే దోమలు పందులతో ప్రజలు రోగాల బారిన పడుతుంటే ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారని అన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు కనీసం పంచాయతీ అధికారులు ఇటువంటి హెచ్చరికలు జారీ చేయకపోవడం వల్లే జనావాసాల మధ్య అడవిని తలపించే విధంగా పిచ్చి చెట్లు పెరిగి ప్రమాదకరంగా తయారయ్యాయని అన్నారు. అశోక్ నగర్ కొత్త కాలనీ పరిధిలో పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్త కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా వెంకట్రామారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు చాట్ల శ్రీనివాసరావు, శాఖా కార్యదర్శులు గోవర్ధన ఝాన్సీ, ఎర్రంశెట్టి పూర్ణిమ, డివైఎఫ్ఐ నాయకులు సతీష్ బాబు, సీనియర్ పార్టీ సభ్యులు చెన్నూరు వెంకటరమణ, హైమావతి, ఆదిలక్ష్మి, సుశీల, లంబురమణ, కందుల మునీశ్వరరావు పాల్గొన్నారు.



## వానలు విస్తారంగా కురుస్తుండడంతో జోరందుకున్న వ్యవసాయ పనులు..

- **వరుణదేవుడు కరుణించడంతో రైతన్నల మోముల్లో ఆనందం.**

**మణుగూరు. జూలై 30(డి డి 9వార్త)**

నిన్న మొన్నటి వరకూ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవక నిరాశలో కూరుకుపోయిన రైతన్నలు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరి నాట్లు వేసేందుకు పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, కుంటలు నీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో అంతంత మాత్రంగానే వర్షాలు పడడంతో మందకొడిగా సాగిన వ్యవసాయ పనుల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఒక్కసారిగా వేగం పెరిగింది. రాగల మూడు రోజులు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## వర్షా కాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం**
- **ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి -- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం టౌన్ , జూలై 30 ( డిడి9 వార్త )**

వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం భద్రాచలం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమగ్గంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ఆరోగ్య




శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యక కార్యాచరణ రూపొందించి ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదే విధంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు ఎలాంటి అటంకాలు లేకుండా అందేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారు చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సహకార సంఘం అధ్యక్షులు అబ్బినేని శ్రీనివాస్తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్..

- **కృతజ్ఞతలను తెలియజేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు, జూలై 30:**

తెలంగాణ రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల అంశంలో సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడం రాష్ట్ర రైతాంగానికి శుభపరిణామమని, ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మాణంలో ఉన్న సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు ఇక పూర్తి స్థాయిలో మార్గం సుగమమైందని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసన సభ షెడ్యూల్డ్ ట్రైబ్స్ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణం & సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం చేసిన కృషి, కేంద్ర ప్రభుత్వంతో జరిపిన సమన్వయం, న్యాయపరమైన చర్యలు ఈ విజయానికి ప్రధాన కారణమయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సహకారం కూడా అభినందనీయమని అన్నారు.



సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పూర్తయితే 36.37 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడి, సుమారు 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు 282.80 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పినపాక నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కలగడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు.

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు లభించిన ఈ అనుకూల తీర్పు రాష్ట్ర నీటిపారుదల రంగంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని, రైతుల అభ్యున్నతికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

చివరిగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల సాధనలో కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు, న్యాయ నిపుణులు మరియు సంబంధిత అధికారులు ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలియజేశారు.

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గడ్డం భద్రయ్య

- **నియామక ఉత్తర్వులు అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ**

**ములుగు, జూలై 29, డీ డీ 9 వార్త :**

ములుగు జిల్లాకు చెందిన గడ్డం భద్రయ్యను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. మాదిగల హక్కుల కోసం పోరాటం చేస్తున్న భద్రయ్య సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఆయనకు ఈ పదవిని కట్టబెట్టారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో మాదిగలకు పెద్దదిక్కుగా, పెద్దన్నగా, 30 ఏళ్ల మాదిగల చిరకాల స్వప్నం, ఎస్సీ వర్గీకరణ సాధించిన మాదిగల ఆరాధ్య దైవం, ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర వర్గీకరణ ధ్యేయంగా ధర్నాలు, రాస్తారోకోలు, చేసి ఉద్యమాలే నా ఊపిరి అంటూ అసెంబ్లీ సాక్షిగా జాతి దండోరా జెండాను ఎత్తుకొని,,నినాదాలు చేసి ఇప్పటికీ 39 కోర్టు కేసులు ఉన్నా, భయమెరుగని, బాధ్యతగల, తల్లిదండ్రుల కడుపులో పుట్టి పెరిగి తల్లిదండ్రులకు గొప్ప పేరును సాధించుకొని, నిన్న హన్మకొండలోని హరిత హోటల్లో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర* అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదేశాలతో,,, ములుగు జిల్లా కు చెందిన ఎమ్మార్పీఎస్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గడ్డం భద్రయ్య మరియు ములుగు జిల్లా నూతన కన్వీనర్లుగా ఉట్ల మోహన్ మాదిగ, గడ్డం శ్యామ్ మాదిగల నియమించిన తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ *గడ్డం భద్రయ్య మాట్లాడుతూ మా మీద నమ్మకముతో మాకు ఇంత పెద్ద పదవి అప్పగించినందుకు ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తానని అంటూ నాకు ఈ పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ గారికి, మరియు కోర్ కమిటీ సభ్యులు ఈ దునూరి యాకయ్య మాదిగ గారికి అలాగే కోర్ కమిటీ సభ్యులు దళిత రత్న నమిండ్ల చిన్న స్వామి మాదిగ కు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రాణాంతక గుంతకు చెక్.. చొరవ చూపిన ఎస్సై, పంచాయతీ అధికారులు..

**జులై30 డిడి 9 వార్త వెంకటాపురం.**

భారీ వర్షాలతో దెబ్బతిన్న వెంకటాపురం-వాజేడు ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలను స్థానిక పోలీసులు, గ్రామపంచాయతీ అధికారులు చొరవ తీసుకుని పూడ్చివేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అరుగుంటపల్లి-జిల్లా కాలనీ గ్రామాల మధ్య పాలెం వాగు వంతెన సమీపంలో భారీ గుంత ఏర్పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో గర్భిణి ద్విచక్ర వాహనం నుంచి కిందపడిన ఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతి, బర్లగూడెం గ్రామపంచాయతీ అధికారి తాటి మౌనిక, వార్డు సభ్యుడు కుంజ మహేష్ జేసీబీ సహాయంతో గుంతలను పూడ్చించి, రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తాటి నరేష్, కొప్పుల సారబాబు కూడా పాల్గొన్నారు. రోడ్ల మరమ్మతుల బాధ్యత కలిగిన శాఖ స్పందించకపోయినా, స్థానిక అధికారులు ముందుండి సమస్యను పరిష్కరించడం అభినందనీయమని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. తాత్కాలిక మరమ్మతులతో ప్రమాదం కొంతవరకు నివారించినప్పటికీ, సంబంధిత రహదారుల శాఖ అధికారులు వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టి ఏజెన్సీ ప్రాంత రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.